

రేపు తెలంగాణ భవన్ కు రండి..!

# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )



బంజారా బిడ్డ మిము మరువదు ఈ గడ్డ

Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :162 | శనివారం 14 జూన్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## నెరవేరిన కల..

### విశ్వవిజేతగా నిలిచిన సౌతాఫ్రికా



2 లో

## మరోసారి సిట్ విచారణకు ప్రభాకర్ రావు

**● ఫోన్ ట్యాపింగ్ కేసులో మూడో దఫా విచారణ ● ప్రభాకర్ ఆదేశాలమీదే ఫోన్ ట్యాపింగ్: మాజీ ఉద్యోగుల స్టేట్‌మెంట్లు కీలకం ● విచారణలో సహకరించని ప్రభాకర్ రావు - ప్రశ్నలకు మౌనం, మళ్లీ ఎదురు ప్రశ్నలు ● ఎన్నికల తర్వాత రాజీనామా, నాలుగు గంటల్లో హార్డ్‌డిస్క్‌లు మాయం ● సిట్ కీలక ప్లాన్: నలుగురు నిందితుల సమగ్ర విచారణ ద్వారా నిజాలు వెలికితీయే యత్నం**



2 లో

న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సిట్ విచారణకు హాజరయ్యారు. ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేశారనే కేసులో ఇప్పటికే రెండుసార్లు ఆయనను సిట్ సుదీర్ఘంగా విచారించింది. ఈ క్రమంలో మరోసారి విచారణకు రావాల్సిందిగా సిట్ నోటీసులు పంపగా.. శనివారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు ప్రభాకర్ రావు చేరుకున్నారు. అనంతరం సిట్ విచారణ మొదలైంది.

## బనకచర్ల టెండర్లు

### వెంటనే నిలిపివేయండి.. కేంద్రమంత్రికి ఉత్తమ్ లేఖ



2 లో

న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్): ఏపీలో గోదావరిపై అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్లకు సంబంధించి టెండర్లను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు శనివారం లేఖ రాశారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ–ఫీజబిలిటి రిపోర్ట్(పీఎఫ్ఆర్)ను సైతం తక్షణమే తిరస్కరించాలని డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన డీపీఆర్‌ను అడ్డుకోవాలన్నారు.



## మరోసారి ఏఐజీ ఆస్పత్రికి కేసీఆర్..

న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రెగ్యులర్ మెడికల్ చెకప్ కోసం గచ్చిబౌలిలోని ఏఐజీ హస్పటల్ కి వెళ్లారు. కేసీఆర్ తో ఆసుపత్రికి కేటీఆర్, హరీష్ రావు వచ్చారు. అయితే, నిన్న కొన్ని టెస్టుల తర్వాత ఈ రోజు మరోసారి ఆసుపత్రికి వెళ్లారు కేసీఆర్. కాగా, గత కొన్ని రోజుల నుంచి ఆయన జలుబుతో బాధపడుతున్నారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన వెంటనే నందినగర్ నివాసానికి వెళ్లనున్నారు. మరో ఐదు రోజుల పాటు బంజారా హిల్స్ లోని నందీనగర్ నివాసంలోనే కేసీఆర్ ఉండనున్నారు.

అయితే, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ లోని బాత్ రూంలో కాలు జారీ పడటంతో యశోద ఆస్పత్రికి కొన్ని రోజుల పాటు చికిత్స పొందారు. ఆ తర్వాత ఫామ్ హౌస్ లోనే రెస్ట్ తీసుకుంటున్నారు. ఇక, గత కొంతకాలంగా జలుబుతో ఇబ్బంది పడుతున్న ఆయన శుక్రవారం నాడు సాయంత్రం ఏఐజీ ఆస్పత్రిలో చెకప్ కోసం వెళ్లారు. మిగతా టెస్టుల కోసమని ఈరోజు మరోసారి వెళ్లారు.



## అంగరంగ వైభవంగా

# గద్దర్ అవార్డుల వేడుక

న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్): తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం హైటెక్స్‌లో ఘనంగా జరిగింది . సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. సినీ ప్రముఖులు బాలకృష్ణ, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, నాగ్ అశ్విన్, సుకుమార్, మణితర్నం, సుహాసిని తదితరులు సందడి చేశారు. పలువురు విజేతలకు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి అవార్డులు అందజేశారు. మెమెంటోతోపాటు నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంది అవార్డులు ఇవ్వగా 2014 నుంచి ఆ ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ 10 ఏండ్ల తర్వాత ఇప్పుడు గద్దర్ అవార్డ్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పురస్కారాలను అందిస్తోంది. 2014 నుంచి 2024 వరకు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన సినిమాలకు, నటులు, దర్శకులు, టెక్నిషియన్లకు ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేసింది.

02

### ఎవరెవరు అవార్డు అందుకున్నారంటే..?

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్
ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్
ప్రథమ ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ
ద్వితీయ ఉత్తమ చిత్రం: పొట్టేల్
తృతీయ ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్
ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: ఆయ్: మేం ఫ్రెండ్సండీ
ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి: శరణ్య (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ సిసిరోలియో (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు: సిధ్ శ్రీరామ్: (నిజమే నే చెబుతున్నా)
ఉత్తమ నేపథ్య గాయని:శ్రేయా ఘోషల్: పుష్ప2 (సూసేటి అగ్గిరవ్వ)
ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేష్ ఆచార్య (దేవర–ఆయుధపూజ)
ఉత్తమ యాక్షన్ కొరియోగ్రఫీ: చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
ఉత్తమ హాస్యనటుడు: సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా2)
ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)



2 లో

## కేటీఆర్‌పై కేసు నమోదు..

న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ ఈ మేరకు పోలీసులకు కంప్లైంట్ చేశారు. సీఎంని కించపరిచేలా, ఆయన ప్రతిష్టను దెబ్బ తీసే ఉద్దేశంతో కేటీఆర్ ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టేలా కామెంట్స్ చేశారని తన ఫిర్యాదులో తెలియజేశారు. కేటీఆర్ చేసిన ఆరోపణలు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ పేర్కొన్నారు.

## బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ మౌనానికి అర్ధం ఏంటి

**● బనకచర్లపై హరీశ్ రావు పీపీటీ ● పాలమూరు బిడ్డనంటూ రేవంత్ నిశ్శబ్దం ఎందుకు? ● కృష్ణా తరహాలో గోదావరి జలాలను ఎత్తుకెళ్లే కుట్రే బనకచర్ల ● తెలంగాణపై నష్టాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజా పోరాటానికి సిద్ధం**



2 లో

న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్):కృష్ణా జలాల తరహాలోనే గోదావరి జలాలను చెరబట్టేందుకు ఏపీ ప్రభుత్వం బనకచర్ల రూపంలో కుతంత్రం చేస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఇప్పటి వరకు నకచర్లపై అఖిలపక్ష సమావేశం పెట్టలేదని విమర్శించారు.

## కాళేశ్వరం పనికిరాదు రద్దు చేయాలి

న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎపిసోడ్ ఇప్పుడు రాజకీయాల్లో ఒక కొత్త చర్చకు దారితీసింది. బీజేపీతో బీఆర్ఎస్ కలవబోతుందనే కవిత ప్రకటనపై పలువురు రాజకీయ నేతలు స్పందిస్తున్నారు. తాజాగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత ప్రకటనతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందం బయటపడిందని అన్నారు.



### - కూనంనేని సాంబశివరావు

**● మావోయిస్టుల మృతదేహాలకూ గౌరవం లేదా ● కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోంది ● "నెలకు 8 వేల ఆదాయం ఉన్నవారు ధనికులా? ● నెలకు రూ. 20వేల ఆదాయం ఉన్నా కూడా పేదవారిగానే పరిగణించాలి**

2 లో

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం..



# సరిగ్గా ఆరోజు జరిగిందదే

### మీడియాకు వివరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్):అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత తొలిసారి మీడియా సమావేశం నిర్వహించింది కేంద్రం. శనివారం శాఖ కార్యదర్శితో కలిసి ప్రమాదానికి సంబంధించిన వివరాలను పంచుకున్నారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలో జరిగిన విమాన ప్రమాదం యావత్ దేశాన్ని కుదిపేసిందన్నారు. ప్రమాద సంఘటన వివరాలను మీడియాకు వివరించారు.

జూన్ 12న అహ్మదాబాద్‌లో కూలిపోయి కనీసం 260 మంది మృతి చెందారు. టేకాఫ్ తీసుకున్న తర్వాత విమానం 650 అడుగుల ఎత్తుకు వెళ్లింది ఆ తర్వాత క్రమంగా డౌన్ కావడం జరిగిందన్నారు. టేకాఫ్ అయిన సరిగ్గా ఒక నిమిషం తర్వాత మేఘనినగర్‌లోని మెడికల్ హాస్టల్ కాంప్లెక్స్‌పై విమానం కూలిపోయిందని



2 లో



శుక్రవారం 13 జూన్ 2025

# హెూం మంత్రి అనిత ఓ రబ్బర్ స్టాంప్..

**న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలా అనే ఆలోచన తప్ప మహిళలకు భద్రత కల్పించాలనే ఆలోచన లేదు ఈ కూటమి ప్రభుత్వానికి అని వైసీపీ మాజీ హెూంమంత్రి తానేటి వనిత ఆరోపించారు. జగనన్న మహిళలకు పెద్దపీట వేశారు.. జగనన్న దిశా యాప్ తెస్తే ఆ యాప్ ను ప్రస్తుత హెూంమంత్రి హేళనగా మాట్లాడారు.. కానీ, ఇప్పుడు అదే దిశా యాప్ పేరు మాత్రమే మార్చి శక్తి యాప్ అని పెట్టారని ఎద్దేవా చేసింది. దిశా చట్టాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తే లోకేష్ తెలుగు మహిళలందరినీ పోగేసి ఆ ప్రతులను తగలబెట్టించారు.. ఏపీని శ్రీలంక చేసేస్తున్నారు.. ప్రజలను సోమరిపోతులను చేసేస్తున్నారని బురదజల్లారు.. జగనన్నను విమర్శించి అంతకంటే ఎక్కువ పథకాలిస్తానని నమ్మించి ప్రజలను మోసం చేశారు అని తానేటి వనిత పేర్కొనింది.

అయితే, ప్రజలకు పథకాలు ఇవ్వాలని ఉన్నా కానీ, భయమేస్తోందని చంద్రబాబు చెబుతున్నారు.. 40 ఏళ్ల సీనియర్ అని చెప్పుకునే నాయకుడు అలా చెప్పడమేంటి అని మాజీ హెూంమంత్రి వనతి ప్రశ్నించింది. అమ్మఒడి పథకంలో 1000 రూపాయలు పాఠశాలల నిర్వహణకు తీసుకుంటే నారా లోకేష్ అనరాని మాటలు అన్నారు.. మరి ఇప్పుడు తల్లికి వందనం పథకంలో లోకేష్ 2 వేలు కోత పెట్టారు అని మండిపడింది. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెట్టి నానా రకాలుగా వేధిస్తున్నారని ఆరోపించింది. ఏడాది కాలంగా ఎంతోమంది చిన్నారులపై అఘాయిత్యాలు జరిగాయి.. హెూంమంత్రి అనిత కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పింది లేదని తానేటి వనతి పేర్కొనింది.

ఇక, హెూంమంత్రి అనిత ఓ రబ్బర్ స్టాంప్ మాదిరి మారారు అని మాజీ మంత్రి వనిత మండిపడింది. వైసీపీ వాళ్లకు ఏ పనీ చేయొద్దని చంద్రబాబు చెబుతున్నారు.. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నారు.. కులం, మతం చూడకుండా అందరికీ సంక్షేమం అందించాలని జగన్ చెప్పారు.. చంద్రబాబుకి.. జగన్ మోహన్ రెడ్డికి ఉన్న తేడా ఇదే అని ఆమె తెలిపింది. రాష్ట్రం రావణకాష్టంలాగా మారింది.. క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిపోయింది.. ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నానని పవన్ కళ్యాణ్ చెప్పారు.. 33 వేల మంది మహిళలు కనిపించకుండా పోయారన్నారు.. మరి ఇప్పుడు ఆ కనిపించకుండా పోయిన మహిళలను ఎవరు కనిపెట్టి తెస్తారని అడిగింది. ఇప్పుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మౌనవ్రతం దాల్చారు.. పవన్ ఎందుకు మౌనవ్రతం దాల్చారో చెప్పాలని తానేటి వనిత కృశ్చన్ చేసింది.

# కేటీఆర్‌పై కేసు నమోదు..

**న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ ఈ మేరకు పోలీసులకు కంప్లైంట్ చేశారు. సీఎంని కించపరిచేలా, ఆయన ప్రతిష్టను దెబ్బ తీసే ఉద్దేశంతో కేటీఆర్ ఉద్దేశపూర్వకంగానే రెచ్చగొట్టేలా కామెంట్స్ చేశారని తన ఫిర్యాదులో తెలియజేశారు. కేటీఆర్ చేసిన ఆరోపణలు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ పేర్కొన్నారు.

అయితే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై మాజీ సీఎం కేసీఆర్‌ను విచారణ కమిషన్ ప్రశ్నిస్తున్న సమయంలో ఇలాంటి కామెంట్స్ చేయడంతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, ప్రజా శాంతికి భంగం కలిగించే అవకాశం ఉందని ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ పోలీస్ కంప్లైంట్ లో రాసుకొచ్చాడు. ఇక, ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. సాక్ష్యాధారాలను పరిగణలోకి తీసుకుని కేటీఆర్‌పై బీఎన్ఎస్ లోని సెక్షన్ 353(2), సెక్షన్ 352 కింద కేసు నమోదు చేశారు.

## మరోసారి సిట్ విచారణకు ప్రభాకర్ రావు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్ రావు అత్యంత కీలకంగా ఉన్నారు. ఆయన ఇచ్చిన ఆదేశాల మేరకే పనిచేశామంటూ కిందస్థాయి సిబ్బంది ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, తిరుపతి రావు, భుజంగరావు కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో స్పష్టం చేశారు. గతంలో అరెస్ట్ అయిన నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ప్రభాకర్ రావును విచారించగా.. ఆయన పోలీసులకు సహకరించని పరిస్థితి. పోలీసులు అడుగుతున్న ప్రశ్నలకు ధాటవేసే ధోరణిలో వ్యవహరించినట్లు సమాచారం. గతంలో జరిగిన అంశాలు తనకు గుర్తు లేదంటూ విచారణ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు విచారించిన నిందితుల స్టేట్‌మెంట్‌ను ముందు ఉంచి ప్రభాకర్‌రావును విచారిస్తున్నారు సిట్ అధికారులు.

సాధారణ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభాకర్ రావు రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆ తరువాత నాలుగు గంటల వ్యవధిలోనే ఎస్ఐబీ కార్యాలయంలోని హార్డ్ డిస్క్‌లు మాయం అయ్యాయి. ప్రణీత్ రావు వీటన్నింటినీ కూడా ధ్వంసం చేసి మూసీలో పడేశారు. ఎవరి ఆదేశాల మేరకు ధ్వంసం చేశారని గతంలో ప్రణీత్ రావును విచారించగా ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు ఇదంతా చేశానంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే తాను ఎవరికీ ఆదేశాలు ఇవ్వలేదని ప్రభాకర్ రావు చెప్పుకొస్తున్నారు. ఆదేశాలు ఇస్తే అందుకు సంబంధించిన ఉత్తర్వుల కాపీలను చూపించాలంటూ పోలీసులకే ఎదురు ప్రశ్నలు వేస్తున్న పరిస్థితి. అంతేకాకుండా ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కీలక ప్రశ్నలు సంధించగా.. ఆయన మౌనం వహించినట్లు సమాచారం.

ఈ క్రమంలో సిట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో నలుగురు నిందితులను ఒకచోట చేర్చి విచారించి ప్రభాకర్ రావు నుంచి సమాధానాలు రాబట్టాలని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ప్రభాకర్ రావుతో పాటు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతిరావులను కూడా విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ మౌనానికి అర్థం ఏంటి

శనివారం తెలంగాణ భవన్ లో బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన హరీశ్ రావు.. ఓవైపు ఈ ప్రాజెక్ట్ కోసం ఈ నెలాఖరులో టెండర్లు పిలిచేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధం అవుతుంటే నిధులు, నిధులు ఆంధ్రాకే అన్నట్టుగా డిల్లీ పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. తెలంగాణలోని ఇద్దరు కేంద్ర మంత్రులు నోరుమెదపడం లేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిపక్షాలను ఇర్రిటేట్ చేసే ఉద్దేశమే తప్ప ఇరిగేషన్ మీద శ్రద్ధ లేదని బనకచర్ల ప్రాజెక్టు ఏపీ ప్రభుత్వం నిర్మిస్తుంటే మన ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు ఉందన్నారు. కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలా ఉపయోగపడుతోందన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే తెలంగాణ సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోందని, ఉత్తమ్ కుమార్ ఉత్తిత్తి మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని పక్క రాష్ట్ర నాయకత్వానికి తాకట్టుపెడ్డారు. బనకచర్లపై మీ మౌనానికి అర్థం ఏంటని నిలదీశారు. 2 టీఎంసీల బాబ్లీ కోసం చంద్రబాబు 2008లో పెద్దపోరాటం చేశారు. 200 టీఎంసీలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే ఎంత పోరాటం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి తెలంగాణ ప్రజల వాయిస్ ను ఢిల్లీకి వినిపిద్ధామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ముందుకురాకపోతే బీఆర్ఎస్ పార్టీ ప్రజా పోరాటానికి, న్యాయపోరాటానికి రూపకల్పన చేస్తామని హెచ్చరించారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఆపాలని చంద్రబాబు లేఖరాస్తే పాలమూరు బిడ్డనని చెప్పుకునే రేవంత్ రెడ్డి నిశబ్ధంగా ఉన్నారు. గోదావరి, కృష్ణానదులపై ఏ ప్రాజెక్టు కట్టాలన్నా అపెక్స్ కౌన్సిల్ అనుమతి ఉండాలని విభజన చట్టంలో ఉంది. కానీ ప్రాజెక్టు కట్టి గోదావరి ట్రైబ్యూనల్ ముందు ఎక్కువ వాటా పొందడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బనకచర్ల వల్ల తెలంగాణకు నష్టం లేదు అని చంద్రబాబు చెప్పిన మాటలు అబద్ధం అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని ఆనాడు చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి, తుమ్మిళ్ల, కల్వకుర్తి, నెట్టింపాడు, సుంకిశాళ ప్రాజెక్టులపై చంద్రబాబు ఫిర్యాదులు చేశారు.

# కేసీఆర్ను కలిసాన లేదా అనేది ఇప్పుడు అనవసరం

**న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్):**కేసీఆర్ సంపూర్ణంగా ఆరోగ్యంగానే ఉన్నారని, రొటీన్ చెక్ అప్ కోసమే ఏఐజీ ఆస్పత్రికి వచ్చారని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. శనివారం ఆమె మీడియాతో చిట్ చాట్ చేశారు. కాళేశ్వరం విచారణ సందర్భంగా ఫాంహౌస్ కు వెళ్లిన కవిత కేసీఆర్ ను కలవలేదనేది మీడియాలో ప్రధానంగా వచ్చింది. దీనిపై ప్రశ్నించగా నో కామెంట్ అంటూ దాటవేశారు. ఈ విషయంపై తాను మాట్లాడితే బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్ అంశానికి మీడియా ప్రాధాన్యం ఇవ్వదని, అందుకే ఆ విషయంపై సమాధానం చెప్పడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆమె చెప్పారు. కాంగ్రెస్ 18 నెలల పాలనలో ఫెయిల్యూర్ అయ్యిందని, అదే బీఆర్ఎస్ కు అడ్వాంటేజ్ కాబోతోందని అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు

కేటాయించాలని డిమాండ్ చేస్తూ భారత జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ విషయంపై బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 42% రిజర్వేషన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, రైల్ రోకోలు చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఇదే అంశంపై ఈ నెల 17న మెదక్ లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లో ఉద్యోగి మాత్రమేని, ముందు ఆయన కొలువు కాపాడుకోవాలని అన్నారు. తమ గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదని అన్నారు. వాళ్ల అధినాయకత్వమే రేవంత్ కు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని చెప్పారు. కేటీఆర్ తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాబట్టే స్పందించానని కవిత చెప్పుకొచ్చారు. మే నెలలో నోటీసులు ఇచ్చినప్పుడు కూడా ఇలాగే స్పందించానని అన్నారు. అలాగే ఇప్పుడూ స్పం దించానని తెలిపారు.

# కాళేశ్వరం పనికిరాదు, రద్దు చేయాలి

## - కూనంనేని సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల స్థితిగతులు ఎలా ఉన్నాయో..తెలంగాణలో కవిత పరిస్థితి కూడా అలాగే ఉందని ఆయన విమర్శించారు. శనివారం హనుమకొండలో కూనంనేని సాంబశివరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు ఇప్పుడు నోరు మూసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదని ఎందుకు అంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. మహారాష్ట్ర పర్మిషన్ ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్‌రావు అంటున్నారని చెప్పారు. గతంలో 140మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని తాము డిమాండ్ చేశామని గుర్తుచేశారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని స్పష్టం చేశారు కూనంనేని సాంబశివరావు.

కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. కమ్యూనిస్టుల మృతదేహాలను చూసి కేంద్రం భయపడుతోందని చెప్పారు. పోలీసుల కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. పేదలు లేని దేశంగా ఇండియాని చూపాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నెలకు రూ. 8 వేల ఆదాయం ఉంటే ధనికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పేదలను మోదీ ప్రభుత్వం దగా చేస్తోందని ఫైర్ అయ్యారు. నెలకు రూ. 20వేల ఆదాయం ఉన్నా కూడా పేదవారిగానే పరిగణించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

# దందాలు నా ఇలాకాలో చెల్లవు.. మంత్రి గడ్డం వివేక్

తన ఇలాకాలో దందాలు, ఇల్లీగల్ బిజినెస్‌లు ఇక చెల్లవని అక్రమార్కులకు మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి వార్నింగ్ ఇచ్చారు. సిద్దిపేట ఇంచార్జ్ మంత్రిగా నియమితులైన ఆయన శనివారం మొదటిసారి నియోజవర్గానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ప్రజలతో ప్రతి



కార్యకర్త ఇంటరాక్ట్ వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. అదేవిధంగా తన సొంత చెన్నూరు నియోజకవర్గంలో అంతా ఇసుక దందాలు బంద్ చేయాలని మాస్ వార్నింగ్ ఇచ్చారు. మంత్రిగా మైనింగ్, కార్మిక శాఖకు న్యాయం చేస్తానని అన్నారు. ఎలాంటి అక్రమాలు జరిగినా.. పోలీసులు హుటాహుటిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ నిజాయితీగా పని చేయాలని.. ప్రజలకు సేవకులుగా ఉందామని మంత్రి వివేక్ పిలుపునిచ్చారు.

## బనకచర్ల టెండర్లు వెంటనే నిలిపివేయండి..

### కేంద్రమంత్రికి ఉత్తమ్ లేఖ

1980లో గోదావరి జలాల ఒప్పందాన్నీ ఉల్లంఘించినట్లు అవుతుందని, గోదావరి జల వివాద ట్రిబ్యునల్‌ను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు దక్కాల్సిన గోదావరి నది వాటా హక్కును ప్రత్యక్షంగా ధిక్కరించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జూన్ 2న నిర్వహించిన సమావేశంలో ఏపీ ప్రభుత్వాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సజ్జన్ యాదవ్ చేసిన సూచన ఇందుకు అద్దం పడుతుందని తెలిపారు. అప్పటికే పీఎఫ్ఆర్ ఆమోదించినట్లు భావించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. డీపీఆర్ సమర్పించడం అంటే సీడబ్ల్యూసీ ఆమోదించినట్లే అవుతుందా అని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ కోసం కేంద్రాన్ని నిధుల కోసం ఒత్తిడి చేసిన అంశాన్ని జనవరి 22,2025న కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌తోపాటు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసిన విషయాన్ని సైతం ప్రస్తావించారు. ఏపీ సీఎం ఈ ప్రాజెక్టు కోసం 2024, నవంబర్ 15న, డిసెంబర్ 29న కేంద్రప్రభుత్వాన్ని ఆశ్రయించారని తెలిపారు. మొత్తం ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం రూ. 80,113 కోట్లు కాగా.. గోదావరి నుండి కృష్ణా వరకు రూ. 13,511 కోట్లు అవుతుందని, కృష్ణా నుండి బొల్లపల్లి రిజర్వాయర్‌కు రూ. 28,560 కోట్లు ఖర్చు అవుతుందని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా బొల్లపల్లి నుండి బనకచర్ల హెడ్ రెగ్యులేటరీకి రూ. 38,041 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారని పేర్కొన్నారు. కేంద్ర జలవనరుల కమిషన్‌తోపాటు గోదావరి-కృష్ణా నది బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఈ ప్రాజెక్టు ప్రక్రియ ముందుకు సాగుతున్నదని మండిపడ్డారు. జీడబ్ల్యూడీటీ అవార్డు ప్రకారం చూసినా 1,486 టీఎంసీలలో 968 టీఎంసీలు తెలంగాణకు కేటాయించబడ్డాయని, ఈ నీటి వాటా కేటాయింపులపై సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ ఆమోదం కోసం వేచిచూస్తున్న తరుణంలో ఏపీ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులను ఎలా ప్రతిపాదిస్తుందని మంత్రి ఉత్తమ్ ప్రశ్నించారు. నీటి కేటాయింపులు లేకుండా ప్రాజెక్టులు నిర్మించే నైతికత ఏపీకి ఎక్కడిదని నిలదీశారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఇచ్చిన లేఖలో సైతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తిస్థాయి ప్రతిపాదనలు తమకు అందలేదని రాసిన లేఖను ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర జలవనరుల సంఘం మార్గదర్శకాలు, ట్రిబ్యునల్ నిర్ణయాలు, అంతర్ రాష్ట్ర ఒప్పందాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ంం

# నెరవేరిన కల..

## విశ్వవిజేతగా నిలిచిన సౌతాఫ్రికా



**న్యూస్ డెస్క్,14 జూన్ (కెరటం న్యూస్):** అంతర్జాతీయ క్రికెట్‌లో కొత్త అధ్యాయం మొదలైంది. 27 ఏళ్లుగా కళ్లలో వొత్తులు వేసుకొని ఐసీసీ ట్రోఫీ కోసం ఎదురుచూస్తున్న దక్షిణాఫ్రికా కల ఎట్టకేలకు సాకారం అయింది. ఆస్ట్రేలియా గోడను బద్ధలు కొడుతూ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో సఫారీ జట్టు విజేతగా అవతరించింది. లార్డ్స్ మైదానంలో వేలాది ప్రేక్షకుల సమక్షంలో టెస్టు గద ను మురిపెంగా గుండెలకు హత్తుకుంది.

ఆసీస్ నిర్దేశించిన 282 పరుగుల లక్ష్య ఛేదనలో ఎడెన్ మర్క్‌రమ్(136) చిరస్మరణీయ సెంచరీతో కదం తొక్కాడు. కెప్టెన్ తెంబ బవుమా(66) అద్భుత బ్యాటింగ్‌తో అలరించగా.. డేవిడ్ బెడింగమ్(21 నాటౌట్)జతగా మర్క్‌రమ్ జట్టును గెలుపు వాకిట నిలిపాడు. అయితే.. విజయానికి 6 పరుగులకు ముందు అతడు ఔటైనా.. కైలీ వెర్రిన్నే(7 నాటౌట్), బెడింగమ్ లాంఛనం పూర్తి చేయగా.. 5 వికెట్ల తేడాతో సఫారీ టీమ్ గెలుపొందింది. అంతే.. డబ్ల్యూటీసీలో కొత్త ఛాంపియన్ ఆవిర్భవించింది. తొలి రెండు సీజన్లలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా విజేతగా నిలవగా.. ఈసారి తమ వంతు అని సఫారీ జట్టు టెస్టు గదను తన్నుకుపోయింది.

మర్క్‌రమ్ అద్భుత సెంచరీ

ఐసీసీ ట్రోఫీని ముద్దాడాలనే దక్షిణాఫ్రికా కల నిజమైంది. లార్డ్స్‌లో తొలి రోజు నుంచి రసవత్తరంగా సాగుతూ.. ఆధిపత్యం చేతులు మారిన్న డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆ జట్టు జయకేతనం ఎగురవేసింది. ఏళ్లుగా తమను ఊరిస్తున్న ఐసీసీ టైటిల్‌ను ట్రోఫీని ఒడిసిపట్టింది. కగిసో రబడ(4-59), లుంగి ఎంగిడి(3-38)ల విజృంభణతో రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 207కే ఆలౌట్ చేసిన సఫారీ జట్టు.. 282 పరుగుల ఛేదనలో అదరగొట్టింది. ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్ (136) చిరస్మరణీయ సెంచరీతో కదం తొక్కగా.. చీలమండ గాయంతో బాధపడుతూనే సారథి తెంబ బవుమా(66) ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు.మూడో రోజు టీ సెషన్ తర్వాత ఆసీస్ బౌలర్లను విసిగిస్తూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారిద్దరూ. చకచకా సింగిల్స్, డబుల్స్ తీస్తూ లక్ష్యాన్ని కరిగించిందీ జోడీ. మరికాసేపట్లో మూడో రోజు ఆట ముగుస్తుందనగా హేజిల్‌వుడ్ ఓవర్లో బౌండరీతో మర్క్‌రమ్ శతకం సాధించాడు. దాంతో, 214 పరుగులతో రోజును ముగించింది సఫారీ జట్టు. నాలుగో రోజు విజయానికి 69 పరుగులు అవసరం కాగా.. తొలి సెషన్‌లో మ్యాచ్ ముగించాలనుకున్నారు మర్క్‌రమ్, బవుమా.

6 పరుగుల దూరంలో..

కానీ.. రెండో రోజు 6 వికెట్లతో నిప్పులు చెరిగిన కమిన్స్.. తన రెండో ఓవర్లోనే బవుమాను ఔట్ చేసి దక్షిణాఫ్రికాకు షాకిచ్చాడు. ఆ కాసేపటికే ట్రిస్టన్ స్టబ్స్(8)ను స్టార్క్ బౌల్డ్ చేసినా మర్క్‌రమ్, డేవిడ్ బెడింగమ్ (21 నాటౌట్) ద్వయం కంగారూ పడలేదు. హేజిల్‌వుడ్ ఓవర్లో మిడ్‌వికెట్ దిశగా మర్క్‌రమ్ రెండు ఫోర్లు బాదాడు. అయితే.. చరిత్రాత్మక విజయానికి 6 పరుగులు అవసరం కాగా హేజిల్‌వుడ్ ఓవర్లో పెద్ద షాట్ ఆడబోయిన మర్క్‌రమ్.. హెడ్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత కైలీ వెర్రిన్నే(7 నాటౌట్) స్టార్క్ బౌలింగ్‌లో బౌండరీ బాదగా .. బవుమా బృందం 5 వికెట్ల తేడాతో విజయం సాధించి ఛాంపియన్ ట్యాగ్ సొంతం చేసుకుంది.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. సరిగ్గా ఆరోజు జరిగిందదే



650 అడుగుల ఎత్తుకు చేరుకున్న తర్వాత విమానం ఎత్తు కోల్పోవడం ప్రారంభమైంది. పైలట్ మధ్యాహ్నం 1:39 (జూన్ 12) గంటలకు ATCకి మేడే కాల్ ఇచ్చాడని తెలిపారు.

ATC ప్రకారం విమానాన్ని సంప్రదించడానికి ప్రయత్నించినప్పుడు ఎటువంటి స్పందన రాలేదు. సరిగ్గా ఒక నిమిషం తర్వాత విమానాశ్రయం నుంచి2 కి.మీ దూరంలో ఉన్న మేఘని నగర్‌లో విమానం కూలిపోయింది" అని పౌరవిమానయాన శాఖ కార్యదర్శి సిన్హా అన్నారు. గురువారం ప్రమాదానికి ముందు ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్ లైనర్ విమానం పారిస్-ఢిల్లీ-అహ్మదాబాద్ సెక్టార్ ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేసిందని సిన్హా చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు మంత్రి రామ్మోహన్ నాయుడు. ప్రమాదం తెలిసిన వెంటనే బోయింగ్ 787 సిరీస్ విమానాలను పరిశీలనకు డీజీసీఏకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. దేశంలో మొత్తం 34 బోయింగ్ విమానాలు ఉండగా, ఇప్పటికే 8 విమానాలను చెక్ చేసినట్లు చెప్పారు.

# అంగరంగ వైభవంగా గద్దర్ అవార్డుల వేడుక



ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: అరుణ్ దేవ్ (35: చిన్న కథ కాదు), హారిక (మెర్సీ కిల్లింగ్)
ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ కమ్యూనల్ హార్మోనీ సోషల్ అప్లిస్ట్: కమిటీ కుర్రాళు

ఉత్తమ చారిత్రక చిత్రం :రజాకార్
స్పెషల్ జ్యూరీ: దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
స్పెషల్ జ్యూరీ: అనన్య నాగళ్ల (పొట్టేల్)
స్పెషల్ జ్యూరీ: సుజిత్, సందీప్ (క)
స్పెషల్ జ్యూరీ: ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ (రాజు యాదవ్)
జ్యూరీ స్పెషల్ మెన్షన్ : ఫరియా అబ్దుల్లా (మత్తువదలరా)
ఉత్తమ తొలి చిత్రం: యదు వంశీ (కమిటీ కుర్రాళ్లు)

**స్పెషల్ అవార్డ్స్**

ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు: నందమూరి బాలకృష్ణ
పైడి జైరాజ్ అవార్డు: మణిరత్నం
బీఎన్‌రెడ్డి ఫిల్మ్ అవార్డు: సుకుమార్
నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిల్మ్ అవార్డు: అట్లూరి పూర్ణ చంద్రరావు
కాంతారావు ఫిల్మ్ అవార్డు: విజయ్ దేవరకొండ
రఘుపతి వెంకయ్య అవార్డు: యండమూరి వీరేంద్రనాథ్

ఈ సందర్భంగా జ్యూరీ కమిటీనీ సత్కరించారు. మురళీ మోహన్, జయసుధ తదితరులు పురస్కారాలు అందుకున్నారు. వేదికపై పలువురు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను మెప్పించాయి.

# బంజారా బిడ్డ మిము మరువదు ఈ గడ్డ



**ఖమ్మం బ్యూరో,14 జూన్ (కెరటం న్యూస్):** తన చివరి శ్వాస వరకు గిరిజనుల హక్కుల కోసం గిరిజనుల సంక్షేమం కోసం... వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పరితపించిన మహా నేత, బంజారా ముద్దుబిడ్డ, వైరా మాజీ ఎమ్మెల్యే భానోత్ మదన్ లాల్ అకాల మరణం గిరిజన ఉద్యమాలకు, సమకాలిన రాజకీయాలకు తీరనిలోటని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఎస్ బీ ఐ టీ విద్యా సంస్థల అధినేత ఆర్ జె సి కృష్ణ, మదన్ లాల్ సోదరుడు భానోత్ సుందర్ లాల్, డీ సి సి బి మాజీ చైర్మన్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కూరాకుల నాగభూషణం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుంతేటి వీరభద్రం, మహిళా న్యాయవాది షేక్ నజీమా, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వీరన్న నాయక్ అన్నారు. శనివారం ఖమ్మం లోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భానోత్ బద్రు నాయక్ అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన వివిధ సామాజిక సంఘాల ప్రముఖులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, బహుజన సంఘాల నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, మహిళా సంఘాలు సహా, కవులు, రచయితలు, గాయకులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంగానూ, తాను ఎమ్మెల్యేగా లేకపోయినా ప్రజల అభివృద్ధి కోసం భానోత్ మదన్ లాల్ అలుపెరగని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రధానంగా సాధారణ పేద కుటుంబం నుంచి వచ్చిన మదన్ లాల్ ఆత్మవిశ్వాసంతో, అంచలంచలుగా ఎదిగి సమాజంలో ఎమ్మెల్యే స్థాయికి ఎదిగి తన జాతి కోసం తన జాతి సంక్షేమం కోసం శాసనసభలోను శాసనసభ బయట విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన అకాల మరణం గిరిజన ఉద్యమాలకు, దళిత, బహుజన సామాజిక వర్గాల ఐక్య పోరాటాలకు, ఆయా శ్రేణులకు తీరని లోటని వారన్నారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడి అనే చిన్న గ్రామం నుంచి తొలిత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎదిగారని అన్నారు. ప్రజల కోసం చేసిన ఉద్యమాల ఫలితంగా తాను కేసులపాలై సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగాన్ని సైతం రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును సాధించి కూడా ప్రజల కోసం పదవిని త్యాగం చేయాల్సి వచ్చింది అని గుర్తు చేశారు. తను ప్రాతినిధ్యం వహిస్తున్న వైరా నియోజకవర్గంలో పాటు తను పుట్టి పెరిగిన రఘునాథపాలెం మండలాన్ని సైతం అన్ని విధాలుగా సమగ్ర అభివృద్ధి చేసిన ఘనత బానోత్ మదన్ లాల్ దే అని అన్నారు. ఖమ్మం నగరం నడిబొడ్డున బంజారా భవన్ నిర్మాణానికి స్థల సేకరణ లోను, భవన నిర్మాణాన్ని చేపట్టడంలోనూ మదన్ లాల్ ఎంతో కృషి చేశారని పలువురు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను ఆయన ఆలోచనలను ప్రజలలోకి తీసుకెళ్లి ఆయన గురించి చైతన్యం కలిగించడంతోపాటు ఆయన కలలుగన్న గిరిజన సంక్షేమం కోసం కృషి చేయడమే మనందరం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఆయన తనయుడు మృగేందర్ లాల్ ఐఏఎస్ ఆఫీసర్ కావాలని ఎన్నో కలలుగని నిజం చేసుకున్నారని గుర్తు చేశారు. ఆనందంగా కుటుంబంతో గడపాల్సిన సమయంలో ఆయన తిరిగిరాని లోకాలకు వెళ్లడం ఆయన కుటుంబానికి తీరని నష్టమని అయినా ఆయన కుటుంబానికి మనందరం అండగా నిలుస్తామని ఒకరికొకరు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన మృతులకు మదన్ లాల్ మృతికి సూచనగా రెండు నిమిషాలు మౌనం పాటించిన అనంతరం మదన్ లాల్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సంస్మరణ సభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీరన్న నాయక్, శోభన్ నాయక్, లక్ష్మణ్ నాయక్, బీ పీ నాయక్, ఉపేంద్ర బాయి, శంకర్ నాయక్, భీముడు నాయక్, మంగ్యా నాయక్, శ్రీనివాస్ నాయక్, నెహ్రూ నాయక్, సుశీల భాయి, జ్యోతిబాయి, త్రివేణి భాయి, బహుజన ఉద్యమకారులు షేక్ నజీమా, పి రాంబాబు, నరేంద్ర, కాపు ఆదినారాయణ, లింగబోయిన లక్ష్మణ్, తిరుపతి



యాదవ్, లలిత నాయక్, రవి నాయక్, గుండెపోగు అఖిల్, రావుల వెంకటేశ్వర్లు, గొట్టిముక్కల శ్రీనివాస్, సంజీవరావు, నాగేశ్వరరావు, వీరనారిమణుల ఆశయ సాధన సమితి కమిటీ నాయకురాలు స్పందన, సరోజినీ, లక్ష్మి, ఝాన్సీ, చందు, ప్రమీల, సుభద్ర, నాగేంద్ర, కవిత, లత, కోమలి తదితరులు పాల్గొన్నారు.







# లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**క్లబ్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్**
**నగర మున్సిపల్ కార్పొరేషన్ చైర్ పర్సన్ నీరజ**
**సేవా కార్యక్రమాల్లో ముందుంటాం**
**లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ**
**మున్సిపల్ కార్మికులకు చీరలు దుప్పట్లు పంపిణీ**
**వికలాంగులకు మూడు చక్రాల సైకిళ్లు అందజేత**
**ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అన్నదానం**



**ఖమ్మం టౌన్,14 జూన్ (కెరటం న్యూస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఏర్పడి 50 సంవత్సరాలు దాటిన సందర్భంగా ఖమ్మంలో ఆ సంస్థ శనివారం గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ ను ఘనంగా నిర్వహించారు. ఈ సెలబ్రేషన్స్ లో భాగంగా నగరంలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు ఉచితంగా చీరలు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యాలయంలో నగర మున్సిపల్ కార్పొరేషన్ చైర్ పర్సన్ నీరజ చేతుల మీదుగా వారికి పంపిణీ చేశారు. వికలాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ నీరజ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. నగరంలో ఎంతోమంది పేదలను చేరదీసి ఆదుకుంటుందన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నిర్వాహకులను ఆమె అభినందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుపేదను ఆదుకుంటూ సేవా కార్యక్రమాల్లో తమ వంతుగా ముందుంటున్నమన్నారు. మున్నేరు వరద ముంపు సమయంలో ఎంతోమంది బాధితులను ఆదుకొని వారికి అండగా నిలిచామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి జి శ్రీరామ్, లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ డాక్టర్ రాఘవరెడ్డి, లయన్ విశ్వేశ్వరరావు, లయన్ డిసిపి రావు, వెంకయ్య, డి అప్పారావు, నవీన్, అలీ, జనార్ధన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకున్న కేసులకు శాశ్వత పరిష్కారం

**● జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ● లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి**

**ఖమ్మం లీగల్,14 జూన్ (కెరటం న్యూస్):** లోక్ అదాలత్ లో కేసును ఇరుపక్షాలు రాజీ చేసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అంతిమ తీర్పుపై ఎటువంటి అప్పీల్ కు అవకాశం వుండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు.శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖర్ రావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జ్ కె. ఉమా దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర్ రావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. రాజగోపాల్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ను కక్షిదారులు



సద్వినియోగం చేసుకొని సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవాలని, ఎటువంటి రుసుము, సమయం వెచ్చించాల్సిన అవసరం లేదని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు సత్వర పరిష్కారమే కాకుండా ప్రీ లిటిగేషన్ (భార్య భర్తల కేసులు, డబ్బు సంబంధించిన కేసులు, సివిల్ తగాదాలు) కూడా పరిష్కారం అవుతాయని అన్నారు. చెక్ బౌన్స్ కేసులు చర్చల ద్వారా లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు. మోటార్ వాహన ప్రమాద కేసులు, అక్క చెల్లెల్లు, అన్నదమ్ముల కేసులు, భార్య భర్తల మధ్య వివాద కేసులను లోక్ అదాలత్ ద్వారా సెటిల్మెంట్ చేసుకోవాలని అన్నారు. న్యాయ సేవా సంస్థ కోర్టు దగ్గర రెగ్యులర్ గా అందుబాటులో ఉంటుందని, మన దగ్గర స్పెషల్ మీడియేషన్ సెంటర్, శిక్షణ పొందిన మీడియేటర్స్ కూడా ఉన్నారని, వారి సహకారంతో కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 3 వేల 500 సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసామని తెలిపారు. 62 మోటార్ వెహికల్ ప్రమాద కేసులలో రాజీ ద్వారా 2 కోట్ల 80 లక్షల పరిహారం ఇప్పించడం జరిగిందని అన్నారు. లోక్ అదాలత్ లో కక్షిదారులు, భీమా కంపెనీలు కూర్చొని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.

న్యాయవాదులు వ్యవస్థలో ఒక భాగమని, వారి సహకారంతో కక్షిదారులకు మంచి తీర్పు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ను కక్షిదారులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడే పవిత్ర బాధ్యత న్యాయవాదులకు ఉంటుందని అన్నారు. న్యాయవాద సేవలను ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు. లోక్ ఆదాలత్ ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అనవసరంగా ప్రైవేట్ సెటిల్మెంట్స్ చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన వృద్ధ మహిళ గొడ్ల రత్తమ్మ తరపున న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ కేసు దాఖలు చేయగా సత్వర పరిష్కారం చేసి హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు ద్వారా 11 లక్షల 50 వేల రూపాయలకు అవార్డ్ అందజేశారు. భవాని, వీరభద్రం భార్య భర్తల వివాదానికి సంబంధించిన కేసు రాజీ ద్వారా పరిష్కరించడం జరిగింది.

అనంతరం పాత్రికేయులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కోర్టు పరిధి లోనే కాకుండా సత్తుపల్లి, మధిర కోర్టులలో కూడా జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ సూచనలు, సలహా మేరకు జాతీయ లోక్ అదాలత్ జరుపుకుంటున్నామని అన్నారు. సివిల్ కేసుల పరిష్కారానికి వీటిని వినియోగించుకోవచ్చని అన్నారు. మనకు సమయం ఆదా అవుతుందని అన్నారు. రాజీ



చేసుకోవాల్సిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులకు కూడా సెటిల్ చేయడం జరుగుతుందని అన్నారు. లోక్ అదాలత్ వల్ల ప్రజలలో మంచి వాతావరణం ఏర్పడుతుందని, వివాదాలు తగ్గిపోతాయని అన్నారు. ప్రశాంత వాతావరణం ఉంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని, రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు.

ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కర్రి ఉమాదేవి, దేవినేని రామప్రసాదరావు, వి. శీనయ్య, యం.అర్చన కుమారి, యం. కల్పన, టి.మురళి మోహన్, కే.వి. చంద్ర శేఖర్ రావు, కాసరగడ్డ దీప, బెక్కమ్ రజని, ఏపూరి బిందు ప్రియ, వి.మాధవి, బి. నాగ లక్ష్మి, బార్ అసోసియేషన్ గద్దల దిలిప్ కుమార్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెని న్యాయవాదులు బండారుపల్లి గంగాధర్, పి. సంధ్య రాణి, కొత్తపల్లి రామారావు, స్వర్ణ రాంబాబు, మందడపు శీనివాసరావు, న్యాయ శాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు



# ఏపీ జల దోపిడీ కుట్ర

**హైదరాబాద్ బ్యూరో,14 జూన్ (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ జల దోపిడీ కుట్రలపై మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హైదరాబాద్ తెలంగాణ భవన్ లో శనివారం సాయంత్రం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు."బనకచర్ల ప్రాజెక్ట్ పేరుతో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీ కుట్రలు"అనే అంశంపై ఆర్థిక, సాగునీటి పారుదల, వైద్యారోగ్య శాఖల మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్,చింత ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. అలాగే, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖరరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చంటి క్రాంతికిరణ్, డాక్టర్ మెతుకు ఆనంద్, గొంగిడి సునీత, బీఆర్ఎస్ నాయకులు వీ.దేవీప్రసాద్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, తుల ఉమ, చిరుమల్ల రాకేష్, కోతి కిశోర్ గౌడ్, ఉపేంద్రాచారి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, వై.సతీష్ రెడ్డి,సోమ భరత్ కుమార్, గోసుల శ్రీనివాస్ యాదవ్, ధర్మేందర్ రెడ్డి, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



# విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి ● విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై కమిటీ సమావేశం



**ఖమ్మం బ్యూరో,14 జూన్ (కెరటం న్యూస్):** రైతులకు మేలు చేసే కోణంలో విత్తన చట్టం రూపకల్పనకు సలహాలు అందించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు.శనివారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిధిలోని వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, రైతు సంఘాల ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ నకిలి విత్తనాల కారణంగా రైతులు అనేక నష్టాలు పాలవుతున్నారని, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కలిసి తెలంగాణ రాష్ట్ర పరిధిలో చట్ట ప్రకారం రైతులను ఆదుకునేందుకు విత్తన చట్టం ముసాయిదా బిల్లు తయారు చేసిందని అన్నారు. విత్తన చట్ట ముసాయిదా బిల్లుపై రైతుల అభిప్రాయాలను తెలుసుకొని, ఎటువంటి అంశాలు చేరిస్తే రైతులకు మేలు జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రతి ఉమ్మడి జిల్లా పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

పత్తి, మిర్చి సాగు చేసే రైతులు చాలా కాలంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలనే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రైతులు లేబుల్ లేని విత్తనాల ప్యాకెట్లు, లూజ్ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని అన్నారు. ప్రతి జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు



అందుబాటులో పెట్టడం జరిగిందని అన్నారు. రైతులు అధికారులతో సమన్వయం చేసుకొని నకిలీ విత్తనాలు అరికట్టేందుకు కృషి చేయాలని అన్నారు. రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు ఆర్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రైతు తన విత్తనం ఉత్పత్తి చేసుకొని పంటలు పండించేవారని, నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. గతంలో ములుగు జిల్లాలో నకిలీ మొక్కజొన్న విత్తనాల ద్వారా 4 వేల ఎకరాలలో పంట నష్టం జరిగితే రైతులకు 4 కోట్ల రూపాయల పరిహారం సంబంధిత కంపెనీ ద్వారా అందించడం జరిగిందని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది జరిగిన రైతు సంక్షేమ కమీషన్ కు ఫిర్యాదు అందిస్తే వారి తరఫున సంపూర్ణ పోరాటం చేయడం జరుగుతుందని అన్నారు. గతంలో పేదలు తిన్న ఆహారం నేడు ధనవంతులు తింటున్నారని తెలిపారు. వరి పంటతో పాటు పప్పు దినుసులకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. గత సంవత్సరం 21 వేలు ఉన్న మిర్చి పంట ఈ సంవత్సరం 12 వేలకు పడిపోయిందని, దీని వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు.

కార్యక్రమంలో న్యాయవాది సునీల్ మాట్లాడుతూ, విత్తన చట్టం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లు తయారు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసిందని అన్నారు. ఒప్పంద వ్యవసాయం పేరిట రకరకాల సాగు జరుగుతోందని అన్నారు. కొత్త చట్టం లో రైతుల కోణంలో ఎటువంటి నిబంధనలు ఉంటే బాగుండాలో సూచనలు అందించాలని అన్నారు. విత్తనాల ప్రకటనలపై రెగ్యులేషన్ ఉండాలని, విత్తన ఉత్పత్తి రైతుల హక్కుల గురించి కూడా చట్టంలో పొందుపర్చాలని అన్నారు.

నాణ్యత లోపాల వల్ల రైతుకు నష్టం కలిగితే పరిహారం పొందే విధానం ఉండాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతు వినియోగదారుడు అవుతారని నష్టపోతే, వినియోగదారుల ఫోరం వెళ్ళవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. రైతుకు కలిగిన మానసిక శోభకు కూడా పరిహారం కోరవచ్చని అన్నారు. రఘునాథపాలెం గ్రామానికి చెందిన రైతు రఘురాం మాట్లాడుతూ ప్రైవేట్ కంపెనీలు తీసుకుని వచ్చే విత్తనాల జెనెటిక్స్ పరిశీలించాలని అన్నారు. నష్ట పరిహారం పరిస్థితి రాకుండా చూడాలని, విత్తనాలను పరిశీలించి ధృవీకరణ చేసినవి మాత్రమే రైతులకు అమ్మేలా చూడాలని అన్నారు. విత్తనాల ప్యాకేట్ పై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి స్కాన్ చేస్తే ఎక్కడ పరీక్షించి సర్టిఫై చేశారు వివరాలు వచ్చేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. వైరా ప్రాంతానికి చెందిన రైతు బి. రాంబాబు మాట్లాడుతూ విత్తనాలు ఉత్పత్తి చేసే రైతులకు సంబంధిత కంపెనీలు సరిగ్గా చెల్లింపులు చేయడం లేదని, దీనిపట్ల కూడా విత్తన చట్టంలో పరిష్కారం చూపాలని అన్నారు. కంపెనీలు కొంతమంది ఏజెంట్ లకు డబ్బులు పంపితే రైతులకు పంచకుండా ఉంటున్నారని, విత్తనాల కంపెనీ నుంచి నేరుగా రైతులకు చెల్లింపులు వచ్చేలా చూడాలని అన్నారు. మంచుకొండ ప్రాంతానికి చెందిన రైతు సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని విత్తనాల కంపెనీలకు ఆర్ అండ్ డీ సెంటర్ లు ఎక్కడ ఉన్నాయో ఆన్ లైన్ లో వివరాలు అందించాలని, సంబంధిత కంపెనీ విత్తనాలు సరిగ్గా పనిచేయని పక్షంలో కంపెనీ యజమాని, డిస్ట్రిబ్యూటర్, శాస్త్రవేత్తలపై కేసులు నమోదు చేసేలా చట్టం తయారు చేయాలని అన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు మాట్లాడుతూ కంపెనీలు వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు అందిస్తే పారదర్శకంగా ఉంటుందని అన్నారు. విత్తనాల ఉత్పత్తి కోసం రైతుల దగ్గరికి వస్తున్న మధ్య వర్తుల గుర్తింపు కోసం కలెక్టరేట్ లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయిల్ పామ్ పంట ను కూడా విత్తన చట్టం పరిధిలోకి తీసుకు రావాలని అన్నారు.

కొణిజెర్ల మండల వ్యవసాయ అధికారి నాగార్జున మాట్లాడుతూ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందించేలా చట్టంలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ఒప్పందం లేకుండా మొక్కజొన్న పంట వేయవద్దని ప్రచారం చేసినప్పటికీ కొంత మంది రైతులు నమ్మి పంట సాగు చేశారని అన్నారు. కంపెనీ ఏజెంట్లకు ఎటువంటి అర్హత ఉండటం లేదని, దీనిని మార్చాలని అన్నారు. అనంతరం పలు రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం విత్తనాల విక్రయాల కోసం ప్రత్యేకంగా సాఫ్ట్ వేర్ తయారు చేసి విత్తనాల ప్యాకేట్



సంబంధించి సర్టిఫికెట్ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. విత్తనాల డిస్టిబ్యూటర్ లు నిబంధనలు పూర్తి స్థాయిలో పాటించేలా కఠిన పర్యవేక్షణ తీసుకుని రావాలని అన్నారు. ఖమ్మం డీలర్ల అసోసియేషన్ ప్రతినిధి మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ ఉన్న కంపెనీల నుంచి విత్తనాలు తెచ్చి డీలర్లు అమ్ముకుంటున్నా రని, అవి సరిగ్గా పనిచేయని పక్షంలో డీలర్ల పాత్ర ఏం ఉంటుందని, లైసెన్సింగ్ విధానం సరిగ్గా లేదని అన్నారు. కంపెనీ నుంచి కాకుండా బయట నుంచి ఎక్కడైనా విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అమ్మితే అప్పుడు డీలర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీన, ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యవసాయ అధికారి వి. బాబు రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేపు తెలంగాణ భవన్ కు రండి..!

## యువ నేత కేటీఆర్ కు మద్దతు పలకండి..!!

## బీఆర్ఎస్ ముఖ్య నేతలకు ఎంపీ వద్దిరాజు పిలుపు



**హైదరాబాద్ బ్యూరో,14 జూన్ (కెరటం న్యూస్):** విచారణ పేరుతో తెలంగాణ ప్రభుత్వం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారిని వేధించడానికి చేసే కుట్రలను విచ్చిన్నం చేస్తూ.. ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ విచారణ కు హాజరవుతున్న కేటీఆర్ గారికి మద్దతు పలుకుదాం. సోమవారం నాడు (16వ తేది) ఉదయం 9:00 గం.కు బీఆర్ఎస్ ముఖ్య నాయకులంతా హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ కు చేరుకోగలరు. అక్కడి నుంచి ఏసీబీ హెడ్ క్వార్టర్స్ (బంజారాహిల్స్) వరకు ప్రదర్శనగా వెళ్లి కేటీఆర్ గారికి మద్దతు పలుకుదామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు.

# గండిపేట మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా అందె లక్ష్మణ్ రావు

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పట్లొల్ల కార్తీక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన



**రాజేంద్రనగర్,14 జూన్ (కెరటం న్యూస్):** గండిపేట మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా అందె లక్ష్మణ్ రావు నియమించినందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పట్లొల్ల కార్తీక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకై తొలి, మలి ఉద్యమాల్లో పాల్గొన్న కరడు గట్టిన తెలంగాణ వాది, సమాజ సేవకుడు, గత 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో, సేవయే పరమావధిగా, ప్రజా సంక్షేమ ఆశయంతో, ప్రజల హక్కుల సాధనకై, సమర్ధతే నెచ్చెలిగా నిలిచే దారులకు వాకిలిగా, కలం అస్త్రమై, సత్యం శక్తియై, న్యాయం నేస్తమై, సమాజానికి దారియై, గొంతు గళమై, ప్రజా సంక్షేమ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్న దరిమిలా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పట్లొల్ల కార్తీక్ రెడ్డి, స్థానిక అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ సమష్టి నిర్ణయంతో, నమ్మకంతో పార్టీ ఉపాధ్యక్ష పదవిని అందె లక్ష్మణ్ రావుకు కట్టబెట్టి, బాధ్యతలను అప్పజెప్పి నందుకు గాను వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ఇచ్చిన బాధ్యతను గురుతర బాధ్యతగా, గులాబీదళ సైనికునిగా, పార్టీ విధేయునిగా స్వీకరిస్తూ, భారత రాష్ట పార్టీ సేవలో భాగంగా మనసా వాచా కర్మణ మణికొండలో నాయకులకు కార్యకర్తలకు అనుసంధాన కర్తగా, ఆలోచనల ప్రభావంతో యువతకు మార్గదర్శనం గావిస్తూ వ్యవహరిస్తానని అన్నారు.

## శంషాబాద్ హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన శంషాబాద్ డీసీపీ రాజేష్, శంషాబాద్ జోన్ పోలీస్ సిబ్బంది

**శంషాబాద్,14 జూన్ (కెరటం న్యూస్):** శంషాబాద్ పోలీస్ స్టేషన్ నందు పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ విజయ్ పోలీస్ స్టేషన్ నందు విధులకు హాజరు అయి పాట్రోలింగ్ మొబైల్ నందు విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో తాను మరణించగా, అతని కుటుంబానికి శంషాబాద్ జోన్ పోలీస్ సిబ్బంది అందరూ కలిసి మొత్తం 15,00,000 రూపాయలు విజయ్ కుటుంబ సభ్యులకు శంషాబాద్ డీసీపీ రాజేష్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఏఐడి డీసీపీ పూర్ణచంద్ర, శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, షాద్నగర్ ఏసీపీ లక్ష్మి నారాయణ , శంషాబాద్ ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి, ఆర్ జి ఐ ఇన్స్పెక్టర్ బాలరాజు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రమోద్, ఇతర పోలీస్ సిబ్బంది హాజరు అవ్వడం జరిగింది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



# వికసిత్ భారత్' సంకల్పంతో బీజేపీ ప్రజాసేవలో ముందంజ

- ● దేశ అభివృద్ధిలో ప్రధాని మోదీ నాయకత్వం విశిష్టం
- ● ప్రతి వర్గానికి న్యాయం .. కేంద్ర పాలన లక్ష్యం
- ● రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు
- ● భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం టౌన్,14 జూన్ (కెరటం న్యూస్):** దేశ అభివృద్ధిలో బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, 'వికసిత్ భారత్' లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం వేగంగా ముందుకు సాగుతోందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు తెలిపారు. శనివారం నాడు నెలకొండపల్లి మండలంలో నిర్వహించిన వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నెల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ, దేశ అభివృద్ధి కోసం కేంద్రం తీసుకున్న నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయని, సేవే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని వివరించారు. దేశానికి మరింత శక్తి చేకూర్చే విధంగా 'వికసిత్ భారత్' కోసం కేంద్రం తీసుకుంటున్న చర్యలు ప్రతిఫలిస్తున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతరిక్ష రంగంలో భారత్ ఘనతలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని, ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలు ప్రయోగించి ప్రపంచ రికార్డు సాధించిన ఘనత ఇస్రోకి దక్కిందన్నారు. అలాగే దేశంలో మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్ అయిన విక్రం ఎస్ ప్రయోగం దేశ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నిధులు జమయ్యేలా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 744 లక్షల కోట్ల రూపాయలు నేరుగా లబ్ధిదారులకు చేరినట్టు పేర్కొన్నారు. దీనివల్ల మధ్యవర్తిత్వం తొలగిపోయి, దాదాపు 23 లక్షల కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకున్నామని వివరించారు.



అలాగే, దేశం మొత్తం 5జీ నెట్‌వర్క్‌తో కనెక్ట్ అయిందని, 99.6శాతం జిల్లాల్లో 5జీ సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇది భారత్‌ను టెక్నాలజీలో శక్తిగా నిలిపే మరో ఘట్టమని పేర్కొన్నారు. అయోధ్య రామమందిరం నిర్మాణం దేశ హిందూ సంస్కృతికి పునరుజ్జీవనం తెచ్చిందని, కాశీ విశ్వనాథ్ కారిడార్, మహాకాళ్ లోక్ ప్రాజెక్టులతో భక్తి, సాంస్కృతిక ఆధ్యాత్మికతకు కొత్త దిశలు తెరవబడ్డాయని అన్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లో తిరుగుబాట్లకు ముగింపు పలికే విధంగా శాంతి పరిరక్షణ చర్యలు తీసుకున్నామని, ఆఫ్స్పు చట్టాన్ని 75శాతం ప్రాంతాల్లో ఉపసంహరించామని, ప్రాంతీయ స్థాయిలో శాంతిని నెలకొల్పామని అన్నారు. గిరిజనులకు మద్దతుగా మిషన్ ఆర్గానిక్ వాల్యూచెయిన్ ద్వారా లక్షల మంది ఆదివాసీ రైతులకు శిక్షణ, మార్కెట్ మద్దతు కల్పించామని వివరించారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 31 కోట్ల మందికి ఉచిత రేషన్ అందించామని, 4 కోట్ల పేదలకు ఇళ్లను కట్టిచ్చామని, 15 కోట్ల గ్రామీణ కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల ఆరోగ్య భీమా కల్పించామని వివరించారు. ఇది పేదలకు ఆరోగ్య భద్రతను కల్పించేందుకు కేంద్రం తీసుకున్న సాహసిక నిర్ణయమన్నారు.

రైతులకు కేంద్రం అండగా నిలుస్తోందని, పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేపట్టామని, పసుపు, పప్పుదినుసుల కొనుగోళ్లలో గత పాలనలతో పోలిస్తే చాలా ఎక్కువగా చెల్లించినట్టు వివరించారు. వ్యవసాయ బీమా పథకం ద్వారా లక్షలాది రైతులకు నష్టపరిహారం అందించామని అన్నారు. మహిళా శక్తిని ప్రోత్సహించేందుకు నారీ వందన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిందని, మహిళల రాజకీయ హక్కులను చాటేలా 33శాతం రిజర్వేషన్ కల్పించామని తెలిపారు. అలాగే మాతృత్వ సెలవులను 26 వారాలకు పెంచినమాటను గుర్తు చేస్తూ, మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కేంద్రం చట్టపరంగా గౌరవం అందిస్తోందని స్పష్టంచేశారు.

బీజేపీ పాలనలో పారదర్శకత, ప్రజల ఆర్థిక స్థిరత్వం, దేశ భద్రత, వృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని నెల్లూరు కోటేశ్వరరావు స్పష్టం చేశారు. దేశ యువతకు స్వయం ఉపాధిని అందించేందుకు స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమానికి బీజేపీ నేతలు మున్నా రవికుమార్, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవీందర్, ఉపేందర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.